క్లుప్తంగా

ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



బాన్సువాడ రూరల్: కేంద్ర ప్రభుత్వ పథకాలైన కిసాన్ సమ్మాన్‌నిధి, ఫసల్‌బీమా యోజన, హెల్త్‌కార్డుల కోసం ప్రతి రైతు ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని బోర్లం క్లస్టర్ ఏఈవో రాణి అన్నారు. గురువారం ఆమె తిర్మలాపూర్ గ్రామంలో ఫార్మర్ ఐడీ విధానంలో రిజిస్ట్రేషన్లు చేపట్టామన్నారు. ప్రతిరైతుకు ప్రత్యేకంగా డిజిటల్ గుర్తింపు కార్డు జారీ చేయడానికి వివరాలు తీసుకుంటున్నామన్నారు. 11 నంబర్ల ఐడీలో రైతుపేరు, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్, పాస్‌బుక్ వివరాలు, భూమిరకం, సర్వేనెంబర్లు, సాగుచేసిన పంట వివరాలు ఉంటాయన్నారు.

ధాన్యం రవాణా వేగవంతం చేయాలి



ఎల్లారెడ్డి: ధాన్యం రవాణా వేగవంతం చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సురేశ్ అన్నారు. గురువారం గండిమాసానిపేట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ధాన్యం తడవకుండా ఉండేందుకు వారికి టార్పాలిన్లు అందించాలని రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం రవాణా త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి సొసైటీ కార్యదర్శి విశ్వనాథం తదితరులున్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



కామారెడ్డి టౌన్: ఈనెల 20వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎల్.దశరథ్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు.అనంతరం సమ్మె వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కే.బాలరాజు, ప్రధాన కార్యదర్శి పి.బాలరాజు, నాయకులు కే. శ్రీనివాస్, ప్రవీణ్, రఫీక్, శ్రీకాంత్, బీరయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఈవోపై చర్యలు తీసుకోవాలి



భిక్కనూరు: మండల కేంద్రంలోని సిద్ధరామేశ్వరాలయ హుండీ లెక్కింపులో చేతి వాటం ప్రదర్శించిన ఆలయ ఉద్యోగి లక్ష్మీనారాయణకు వత్తాసు పలుకుతున్న ఆలయ ఈవో శ్రీధర్‌పై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. హుండీలో చేతి వాటం ప్రదర్శించిన ఉద్యోగితో ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే దేవాదాయశాఖ అధికారులు చర్యలు తీసుకొని సదరు ఉద్యోగిని విధుల నుంచి తొలగించాలన్నారు. సదరు ఉద్యోగికి సహకరించిన ఈవో శ్రీధర్‌పై కూడా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. దళితసంఘాల నేతలు నర్మల రాంచంద్రం, ద్యాగల కిరణ్, శ్యామార్తి రాజు, ప్రసాద్, మల్లేశం, భూమయ్య పాల్గొన్నారు.

బావికి పైకప్పు నిర్మాణం ప్రారంభం



బీబీపేట: మండల కేంద్రంలో ఉన్న నల్లాల బావి పైకప్పు కోసం చేస్తున్న పనులను గురువారం ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్ ప్రారంభించారు. మార్చి 7న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఈబావిని సందర్శించారు. దీంతో పైకప్పు నిర్మాణం కోసం రూ. 2.80లక్షలు నిధులు విడుదలయ్యాయి. ఇనుప చువ్వలతో జాలిని ఏర్పాటు చేస్తున్నారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి రమేశ్ ఉన్నారు.

జీవాల కోసం వలస బాట

- సంగారెడ్డి జిల్లా నుంచి రెండు నెలల క్రితం వలస వచ్చిన కాపరులు
- మేకలు, గొర్రెలకు తాగునీరు, మేత లేకపోవడంతో..



తిమ్మారెడ్డి, ఆజామాబాద్ శివారులో మేత మేస్తున్న మేకలు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పొట్టకూటి కోసం మేకలను, గొర్రెలను తీసుకుని కాపరులు వలస బాట పట్టారు. సంగారెడ్డి జిల్లాలోని నారాయణ్‌ఖేడ్ ప్రాంతంలోని రేగోడ్, నాగ్‌ధర్, ర్యాలమడుగు, కల్హేర్, మాసానిపల్లి, కంగ్టి, న్యాల్‌కల్, చీకుర్తి, మనూర్, మూడు గుంటలు తదితర గ్రామాలకు చెందిన పశువుల కాపర్లు పశువులకు తాగునీరు, మేత లేక పోవడంతో వలస బాట పట్టారు. అక్కడి నుంచి నిజాంసాగర్ మీదుగా మేపుకుంటు ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి, అన్నాసాగర్, ఆజామాబాద్ గ్రామాల శివారులో పంట పొల్లాల్లో మేపుకుంటు జీవనం గడుపుతున్నారు.

పశువులను రాత్రి పొలాల్లో ఉంచుతూ జీవనాధారం...

మేకలు, గొర్రెలు రాత్రి వేళల్లో రైతులకు సంబంధించిన వారి పంట పొలాల్లో బస చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. మేకల మందను పంట పొల్లాల్లో రాత్రి బస చేస్తే వారు రెండు అడ్డల బియ్యం, రూ.200 తీసుకుంటారు. చౌడు భూముల్లో మేకలు, గొర్రెలు రాత్రి వేళలో బస చేయడంతో వాటి ఎరువు వలన భూములు సారవంతమవుతాయి. పశువుల కాపరులకు తినేందుకు బియ్యం, ఖర్చులకు డబ్బులు వస్తున్నాయి. దీంతో ఇరువురు లబ్ధి పొందుతున్నారు.

రెండు, మూడు నెలల పాటు ఇక్కడే మకాం...

మార్చి నుంచి వారి వారి ప్రాంతాల నుంచి బయలు దేరిన పశువుల కాపర్లు జూన్‌లో వర్షం కురిసే వరకు ఇక్కడే పంట పొలాల్లో తిరుగుతు మేకలను, గొర్రెలను మేపుతూ జీవనం గడిస్తారు. పశువులకు మేత లభించడంతో పాటు వారి జీవనభృతి లభించడంతో ఇబ్బందులు లేకుండా ఉంటున్నారు.

మేత దొరకక పోవడంతో..



పశువులకు మేత దొరకని కారణంగా నారాయణ్‌ఖేడ్ ప్రాంతంలోని నాగ్‌ధర్ ప్రాంతం నుంచి వలస వచ్చాను. కుటుంబంతో సహా రెండు నెలల క్రితం ఇంటి నుంచి బయలు దేరాం. వర్షాలు కురిసిన తరువాత మాప్రాంతాలకు తిరిగి వెళ్లి పోతాం.

– సాయిలు, నాగ్‌ధర్, నారాయణ్‌ఖేడ్

పొలంలో మేకల మందను ఉంచి..



ఉదయం నుంచి రాత్రి వరకు మేకలు, గొర్రెలను మేపుతాం. రాత్రి వేళల్లో రైతుల పంట పొలాల్లో మేకల మందతో బస చేస్తాం. దీంతో రైతుల చౌడు భూములు సారవంతం అవుతాయి. వీటి పేడ, మూత్రంతో భూమిలోని క్రిములు నశిస్తాయి. దీంతో రైతులు మేకల మందలను రాత్రి వేళల్లో బస చేసేందుకు ఆసక్తి కనబరుస్తారు.

– గురునాథ్, రేగోడ్

కనులపండువగా వేంకటేశ్వరుడి కల్యాణం



మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చకులు

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీదేవి, భూదేవి సహిత వెంకటేశ్వర స్వామి ఆలయ ఏడో వార్షికోత్సవం ఘనంగా జరుగుతోంది. ఇందులో భాగంగా శ్రీదేవి, భూదేవి, సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని మంత్రోచ్ఛరణల మధ్య వేద పండితులు కనులపండువగా నిర్వహించారు. అంతకుముందు మంగళవాయిద్యాల మధ్య స్వామి వారి ఉత్సవమూర్తులను ఊరేగింపు చేపట్టారు. ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో స్వామి వారికి పట్టు వస్త్రాలు, పుస్తె మట్టెలు అందజేశారు. భక్తుల జయజయ ధ్వానాల మధ్య మాంగల్య ధారణ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితుడు రవికాంత్‌చారి, ప్రసాద్‌శర్మ, వేణుగోపాల్‌శర్మ, వంశీశర్మ, సోమదత్త శర్మల ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి వారికి పల్లకి సేవతో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొమిరెడ్డి పెద్ద నారాయణ, బండారి యాదవరెడ్డి, తేలు ఆంజనేయులు, బండారి రాజిరెడ్డి, శేరోళ్ల నారాయణ, నర్సారెడ్డి, మాజీ కౌన్సిలర్ కాసర్ల శ్రీనివాస్, మంచాల లింగం, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని పకడ్బందీగా అమలుచేయాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో సురేందర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామంలో పారిశుధ్యాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. మండలంలోని వెంకంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో పలురికార్డులను ఆయన పరిశీలించారు. దీంతో పాటు గ్రామంలోని పలువీధుల్లో పర్యటించి పారిశుధ్య పనుల నిర్వాహణపై ఆరా తీశారు. గ్రామశివారులోని పల్లెప్రకృతివనం, నర్సరీని ఆయన పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా క్రమం తప్పకుండా నీటిని పోయించాలని ఆయన సూచించారు. దీంతోపాటు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలని ఆయన సూచించారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శి రజిత ఉన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు



తాడ్వాయిలో ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ చేస్తున్న అధికారులు

తాడ్వాయి/భిక్కనూరు/దోమకొండ/ఎల్లారెడ్డిరూరల్ : ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడ్వాయికి 34 ఇళ్లు మంజూరుకాగా, ఇళ్లను పారదర్శకంగా నిర్మించుకోవాలన్నారు. ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు.గ్రామంలో తాగునీరు ఇబ్బందులు లేకుండా చూడాలని జీపీ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీ, ఎంపీవో సవితారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, శ్యాంరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్, పెద్దమల్లారెడ్డి, మల్లుపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పీసీసీ కార్యదర్శి ఇంద్రకరన్‌రెడ్డి, గ్రంథాలయసంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డిలు మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను నిర్మించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బల్యాల సుదర్శన్, బీంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. దోమకొండ మండలం లింగుపల్లి, అంచనూర్, చింతామన్‌పల్లి, అంబరిపేట గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ భూమి పూజ చేశారు. లింగుపల్లికి 12 మంది మంజూరు కాగా 7శంకుస్థాపన, అంచునూరు గ్రామంలో 27 మంజూరు కాగా 11 శంకుస్థాపన ఇళ్లకు శంకుస్థాపన చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పల్లె రామస్వామి గౌడ్, పట్టణఅధ్యక్షుడు సీతారాం మధు, డైరెక్టర్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.ఎల్లారెడ్డి మండలం అడివిలింగాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు పత్రాలను లబ్ధిదారులకు ఎంపీవో ప్రకాష్ అందించారు. అలాగే ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఎంపీవో భూమిపూజ చేసి మార్కింగ్ వేశారు.

మోడల్ కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

బాన్సువాడ రూరల్: మండలంలోని కొత్తాబాది మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కమల్ కిషోర్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈనెల 20 వరకు దరఖాస్తుల స్వీకరించి 26న మెరిట్ జాబితాను ప్రదర్శిస్తామన్నారు. ఈనెల 27నుంచి 31 వరకు సర్టిఫికేట్ వెరిఫికేషన్, అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఆసక్తి గల స్థానిక విద్యార్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బస్‌షెల్టర్ నిర్మాణానికి స్థల పరిశీలన



భిక్కనూరు: మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ వద్ద బస్ షెల్టర్ నిర్మాణానికి నేషనల్ హైవే అధికారులు గురువారం స్థల పరిశీలన చేశారు. గ్రామస్తులు బస్‌షెల్టర్ నిర్మించాలని ఇటీవల ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి విన్నవించగా అధికారులకు స్థల పరిశీలన చేశారు. వారి వెంట బీజేపీ మండల ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి, నేతలు సిద్ధు తదితరులు ఉన్నారు.

17 నుంచి క్రికెట్ టోర్నమెంట్

దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో ఈనెల 17వ తేదీ నుంచి మూడు రోజుల పాటు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నరేష్, ప్రవీణ్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనే జట్లు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని, ఎంట్రీ ఫీజు రూ.వేయి ఉంటుందన్నారు. గెలిచిన జట్లుకు ప్రైజ్‌మనీ ఉంటుందని వివరించారు. మండలానికి చెందిన వివిధ గ్రామాల జట్లు మాత్రమే పాల్గొవాలన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ 9640911792లో సంప్రదించాలని కోరారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



రాజంపేట: మండలంలోని ఆర్గొండ గ్రామంలో ఉన్న పెద్దమ్మ ఆలయంలో నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా కెమెరాల ఏర్పాటుకు కృషి చేసిన ఆలయ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ రాజేశ్, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న టోల్ ప్లాజా కార్మికులు

కామారెడ్డి క్రైం: భిక్కనూర్ టోల్‌ప్లాజా నుంచి అకారణంగా తమను విధుల్లో నుంచి తొలగించిన టీబీఆర్ కంపెనీ తన మొండి వైఖరిని వీడాలని కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నాచేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గడిచిన 9 ఏళ్లుగా దాదాపు 77మంది కార్మికులు షిఫ్టులవారీగా భిక్కనూర్ టోల్ ప్లాజాలో పని చేస్తున్నామని తెలిపారు. మూడు నెలల క్రితం 37 మందిని టోల్ ప్లాజాను నిర్వహిస్తున్న బీవీఆర్ కంపెనీ తొలగించిందన్నారు. ఎలాంటి కారణం లేకుండా విధుల నుంచి తొలగించడంతో కుటుంబాలు వీధిన పడ్డాయని కార్మికులు కుటుంబాలు వీధిన పడ్డాయని వాపోయారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.

కొత్తాబాది గ్రామంలో బోరుబావి తవ్వకం



బాన్సువాడ రూరల్: మండలంలోని కొత్తాబాది గ్రామంలో జాతీయ రహదారి పనుల్లో భాగంగా రెండు బోరుబావులు, మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసకావడంతో తాగునీటి సమస్య తీవ్రమైంది. ఈవిషయాన్ని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి గురువారం గ్రామంలో స్వంత ఖర్చులతో బోరుబావి తవ్వించినట్లు నాయకులు ధరావత్ ఆనంద్ తెలిపారు. నీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం గ్రామానికి బోరుబండి పంపించిన ఏనుగు రవీందర్‌రెడ్డిని గ్రామస్తులు అభినందించారు.

ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక సహాయం



బీబీపేట: మండలంలోని జనగామ గ్రామానికి చెందిన ఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో అదే గ్రామానికి చెందిన పేదింటి ఆడబిడ్డ బ్యాగరి జ్యోతి వివాహానికి రూ. 25 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ జ్యోతి చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోవడంతో పాటు తోడబుట్టిన ముగ్గురు చెల్లెళ్ల వివాహాలు చేసి వారి కాపురాలు చక్కదిద్దింది. చివరికి కుటుంబ బాధ్యతలు మోస్తూనే గురువారం వివాహం చేసుకుంది. కార్యక్రమంలో ఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మొక్కను బతికించాలి

సాక్షి ఎఫెక్ట్..



నాచుపల్లి తండా పల్లె ప్రకృతి వనం పరిశీలిస్తున్న ఎంపీడీవో సూర్యకాంత్

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని రాముల గుట్ట తండా గ్రామ పంచాయతీ పరిధిలో గల నాచుపల్లి తండా పల్లె ప్రకృతి వనంలో ప్రతి మొక్కను బతికించాలని ఎంపీడీవో సూర్యకాంత్ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గురువారం పట్టింపు లేని పల్లె ప్రకృతి వనం అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రతి గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలోని మొక్కలను కాపాడాల్సిన బాధ్యత కార్యదర్శులదే అన్నారు. అలాగే నర్సరీలోని గల కవర్లలో విత్తనాలు నాటి నీరు పట్టి మొక్కలు పెరిగేలా చూడాలన్నారు. విధుల్లో ఎవ్వరు నిర్లక్ష్యం వహించినా ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఆయన వెంట ఎంపీవో రమణ ఉన్నారు.

వెండి గొడుగు బహూకరణ



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలం బూర్గుల్ గ్రామ గేటు వద్ద ఉన్న సాయిబాబా ఆలయానికి గురువారం చెలిమెల పద్మ వెంకటేశం దంపతులు వెండి గొడుగును బహూకరించారు. ధర్మారంపేట గ్రామానికి చెందిన దంపతులు 4 ఏళ్ల కింద సాయిబాబాను దర్శించుకున్నారు. వారి కోరిక నెర వేడంతో 13 తులాల వెండి గొడుగను తయారు చేయించి ఆలయ సిబ్బందికి అప్పగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ విజయ్ కుమార్, శ్రీనివాస్‌గుప్తా, ఆలయ పూజారి రాజు తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బీబీపేట: మండల కేంద్రంలో గురువారం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 2000–01 పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆత్మీయంగా కలుసుకున్నారు. వారికి విద్యుబుద్ధులు నేర్పిన గురువులతో ముచ్చటించారు. విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులకు శాలువాలతో సన్మానం చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న నాయకులు

నిజాంసాగర్/రాజంపేట: నిజాంసాగర్ మండలం బ్రహ్మణపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గురువారం కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిరంజీవి చేతుల మీదుగా మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి తుకారం తదితరులు ఉన్నారు. రాజంపేట మండలం శివాయిపల్లి గ్రామంలో అర్హులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలను అందజేసినట్లు జీపీ కార్యదర్శి అరుణ్ కుమార్ తెలిపారు. గ్రామంలో 13 మందిని ఎంపిక చేయగా, 10 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు నిట్టూరి ఆనంద్ రావు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెడ్డిపేట యువకవికి సన్మానం



బుర్ర శరత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కవులు

రామారెడ్డి: తెలంగాణ సాహిత్య అకాడమీ, ప్రబోధ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ కవి సమ్మేళనంలో 'మద్యం' అనే కవితకు గాను రెడ్డిపేట గ్రామానికి చెందిన బుర్ర శరత్‌గౌడ్ తెలంగాణ కవి ప్రముఖులు సన్మానం అందుకున్నారు. బుధవారం హైదరాబాద్ లోని లలిత కళా వేదికలో యువకవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పద్మశ్రీ ఆచార్య కొలకనూరి ఇనాక్ , విశిష్ట అతిథిగా డా. నమోజు బాలాచారి, త్రిభాషా కవయిత్రి శోభా దేశ్ పాండే, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకర్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

ధాన్యం సేకరణ త్వరితగతిన చేపట్టాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ధాన్యం సేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గురువారం సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలను తీసుకోవాలని, ధాన్యం రవాణా వేగవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సదాశివరెడ్డి, డీఎం రాజేందర్, డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, జిల్లా సహకార అధికారి రామ్‌మోహన్, తహసీల్దార్ గంగాసాగర్, ఎంపీడీవో సంతోష్‌కుమార్ తదితరులున్నారు.

నేడు సీజ్ చేసిన ఇసుక వేలం

మద్నూర్: డోంగ్లి మండలంలోని చిన్న టాక్లీ శివారులో డంప్ చేసిన 13 ఇసుక ట్రాక్టర్ల ఇసుకకు శుక్రవారం వేలం నిర్వహించనున్నట్లు డోంగ్లి ఆర్ఐ సాయిబాబా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిన్న టాక్లీ శివారులో అక్రమంగా డంప్ చేసిన 13 ట్రాక్టర్ల ఇసుకను పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

గ్రంథాలయాలకు ఫర్నిచర్ పంపిణీ



ఎల్లారెడ్డి/తాడ్వాయి : ఎల్లారెడ్డి, తాడ్వాయి శాఖ గ్రంథాలయాలకు, జిల్లా గ్రంథాలయం నుంచి ఫర్నిచర్ రావడం జరిగిందని గ్రంథపాలకులు జాకీర్, రాజలింగం గురువారం తెలిపారు. గ్రంథాలయానికి రీడింగ్ ప్యాడ్‌లు, కుర్చీలు రావడం జరిగిందన్నారు. గ్రంథాలయానికి ఫర్నిచర్ రావడంతో పాఠకులకు ఇబ్బందులు తీరనున్నాయి.

లింగారెడ్డిపేటలో చిన్నారులకు కంటి పరీక్షలు

ఎల్లారెడ్డిరూరల్ : మున్సిపాలిటి పరిధిలోని లింగారెడ్డిపేట గ్రామంలో గురువారం చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహించిన కంటిశిబిరంలో చిన్నారులకు కంటి పరీక్షలను ఆప్తాల్మిక్ వైద్యులు హరికిషన్ కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులున్నారు.

దరఖాస్తుల వెరిఫికేషన్



రాజంపేట: రాజీవ్ యువ వికాసం పథకం కోసం అందిన 800 లబ్ధిదారుల దరఖాస్తులను బ్యాంకులో అందించినట్లు ఐకేపీ డీపీఎం రమేశ్ బాబు తెలిపారు. దరఖాస్తుదారుల సిబిల్ వెరిఫికేషన్ గురించి బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడి గ్రౌండింగ్ చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సాయిలు, సీసీ సాయిలు పాల్గొన్నారు.